ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025



మద్దువలసలో ఏనుగుల తిష్ట

మద్దువలస ప్రాజెక్టు పక్కన ఉన్న కొండ వద్ద గజరాజులు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మద్దువలసలో ఈనెల 25న ప్రవేశించిన గజరాజులు తాజాగా మద్దువలస పంచాయతీ జగన్నాధవలస సమీపంలో తిష్టవేశారు. గ్రామానికి చెందిన పడాల రాజు పశువుల సాలను, విద్యుత్తు పరికరాలు, నూర్పిడి యంత్రాన్ని ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు అక్కడనుండి పక్కనే ఉన్న మద్దువలసకు చేరుకుని ప్రాజెక్టు సమీపంలో ఉన్న కొండపైన సంచరిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం 7గంటల సమయంలో మద్దువలసకు అతి సమీపంలో గజరాజులు రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు.

మిగిలిన ఒక్క విద్యార్థి సాయిమనోహర్

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం విద్యార్థుల పాలిట శాపంలా మారింది. ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేని విద్యార్థులు కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారు. మరికొందరు మధ్యలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. తాజాగా గుజ్జన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఒకే ఒక విద్యార్థి 3వ తరగతికి వేరే పాఠశాలకు వెళ్లాల్సి రావడంతో టిసి ఇచ్చేశారు. ఆ పాఠశాలలో విద్యార్థులెవరూ లేకపోవడంతో ఉపాధ్యాయురాలిని అధికారులు వేరే పాఠశాలకు డిప్యుటేషన్ వేశారు. దీంతో పాఠశాల మూతపడింది.

ఒకే ఒక్కరు

- మూతపడిన ప్రభుత్వ పాఠశాల
- వేరే స్కూల్‌కి వెళ్లలేక చదువుకు దూరమైన విద్యార్థి
- మరో పాఠశాలకు ఉపాధ్యాయురాలు డెప్యుటేషన్
- విద్యార్థులకు శాపంగా నూతన విద్యా విధానం

ప్రజాశక్తి-సంతకవిటి

ప్రభుత్వ విద్యా విధానం సంతకవిటి మండలం గుజ్జన్నపేట గ్రామంలో విద్యార్థులకు శాపంగా మారింది. 2020కు ముందు గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కళకళలాడేది. తరువాత వచ్చిన నూతన విధానంతో 3,4,5 తరగతులను వేరు చేసి వేరే పాఠశాలలో విలీనం చేయడంతో 10 మంది మాత్రమే మిగిలారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాల మూతపడుతుందని ప్రచారం జరగడంతో వారంతా వేర్వేరు ప్రైవేటు పాఠశాలల్లో చేరిపోయారు. గ్రామానికి చెందిన జి. సాయి మనోహర్ గ్రామంలోని పాఠశాలలో 1, 2 తరగతులు చదువుకున్నాడు. ఈ ఏడాది మూడో తరగతిలో చేరాల్సి ఉండడంతో ఈ విద్యార్థికి టిసి ఇచ్చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం ప్రకారం, ఆ పాఠశాల నుంచి మూడు నుంచి ఐదు తరగతులను వేరే చేసి అదే మండలంలో మూడు కిలోమీటర్ల దూరంలోని వంజరాం ఉన్నత పాఠశాలలో కలిపేశారు. సాయి మనోహర్ తల్లిదండ్రులు నిరుపేదలు కావడం, పాఠశాలకు పంపేందుకు రవాణా ఖర్చులు కూడా పెట్టుకోలేక ఆ పాఠశాలకు పంపడం మానేశారు. విద్యార్థులెవరూ లేకపోవడంతో ఉపాధ్యాయురాలు ఎన్. నారాయణమ్మను విద్యాశాఖ అధికారులు ఎస్.అగ్రహారం గ్రామంలోని పాఠశాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఫలితంగా ఆ పాఠశాల మూతపడింది. మొత్తంగా గ్రామంలో ఎన్నోఏళ్లగా ఉన్న పాఠశాల మూతపడడంతో గ్రామస్తులందరికీ దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. రెండేళ్లుగా ఒకే టీచర్, ఒకే విద్యార్థి ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో పాఠశాలలో ఇప్పుడు ఉపాధ్యాయులు లేరు, విద్యార్థులు లేరు. గజ్జన్నపేట పాఠశాల నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా మారింది.

కానీ సాయి మనోహర్‌లో చదువుకోవాలనే తపన పోలేదు. రోజూ బ్యాగ్‌పట్టుకొని పాఠశాలకు వచ్చి మెట్ల వద్ద కూర్చోవడాన్ని చూసిన వారి హృదయాలను చలింపజేస్తోంది. టీచర్ వస్తారని, చదువు చెబుతారని ఆశించిన ఆ చిన్నారికి నిరాశే ఎదురైంది. శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించిన ప్రజాశక్తికి ఆ పాఠశాల వద్ద కూర్చొని టీచర్ రాక కోసం ఎదురు చూస్తున్న సాయి మనోహర్ కనిపించాడు. పాఠశాల మూతపడిందని చెప్పడంతో పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాడు.

ప్రభుత్వమే కారణం

మా ఊరు స్కూలు పిల్లలు గతంలో 6మంది వరకు ఉండేవారు. అయితే ఐదో తరగతి వరకు ఉంటే కొద్ది మంది వచ్చి చేరుతారు. ప్రభుత్వం ఒకటి, రెండు తరగతులను మాత్రమే ఇక్కడ ఉంచడంతో తల్లిదండ్రులు సంతకవిటి, వాల్తేరు, చిత్తరపురం, ఆమదాలవలసలో పిల్లలను జాయిన్ చేస్తున్నారు. చివరికి మా ఊరు స్కూలు ను ప్రభుత్వం మూసివేస్తున్న పరిస్థితిని తీసుకొచ్చింది.

- జి.ఈశ్వరరావు, గ్రామస్తుడు

ఇక్కడ 2వ తరగతి వరకే

మా ఊరు బడి ఫౌండేషన్ స్కూల్ అవ్వడంతో ఇక్కడ ప్రస్తుతం ఉన్న ఒక్క విద్యార్థి కూడా నేడు లేని పరిస్థితి ఏర్పడింది. ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ఉంటే విద్యార్థులు ఉండేవారు. కానీ ప్రస్తుతం కేవలం ఒకటి రెండు తరగతులు మాత్రమే ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు జాయిన్ చేయడానికి ఇష్టపడటం లేదు.

- జి. త్రినాధరావు, గ్రామస్తుడు

విద్యార్థులు లేక ఉపాధ్యాయురాలిని డెప్యుటేషన్ వేశాం

గుజ్జన్నపేట పాఠశాల ఫౌండేషన్ కావడంతో ఉన్న ఒక్క విద్యార్థి కూడా 3వ తరగతికి పక్క స్కూల్‌కు పంపాల్సి వచ్చింది. పాఠశాలలో విద్యార్థులెవరూ ఈ విద్యా సంవత్సరం జాయిన్ కాకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని ఎస్.అగ్రహారం పాఠశాలకు డిప్యూటేషన్ వేసాం.

- బి. శాంతికుమారి, ఎంఇఒ, సంతకవిటి

టిడిపి మండల అధ్యక్ష పదవి కోసం

తన్నుకున్న తమ్ముళ్లు

అభిప్రాయ సేకరణ సమావేశంలో రసాభాస

పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ

గొడవ పడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-డెంకాడ

టిడిపి మండల అధ్యక్ష పదవి కోసం తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. పదవి తమ గ్రూపునకు ఇవ్వాలంటే మా గ్రూపునకు ఇవ్వాలంటూ రెండు గ్రూపులూ గొడవ పడ్డాయి. ఈ గొడవ చిలికి చిలికి గాలి వానలా మారి పెద్దదయింది. ఒకరినొకరు తోసుకొని కొట్టుకునే వరకు వెళ్లింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

టిడిపి డెంకాడ మండల అధ్యక్ష పదవి చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంది. మండలంలో టిడిపిలో రెండు గ్రూపులు ఉన్నాయి. ప్రతి గ్రామంలోను మహానాడుకు ముందు రెండు గ్రూపులూ వేర్వేరు కమిటీలు వేసుకున్నాయి. మండల టిడిపి అధ్యక్ష పదవి ఎన్నిక మహానాడు ముందు జరగాల్సి ఉన్నా గ్రూపుల కారణంగా జరగలేదు. తాజాగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకునేందుకు స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. పరిశీలకులుగా విజయనగరం నుంచి నాయకులు కనకల మురళీమోహన్‌రావు. నియోజవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు హాజరయ్యారు. తమ బలాన్ని నిరూపించుకునేందుకు రెండు గ్రూపుల వారు సుమారు 500 నుంచి 700 మందిని పార్టీ కార్యాలయానికి వేర్వేరుగా తరలించారు. సమావేశం ప్రారంభం కాగానే పార్టీ సీనియర్ నాయకుడు కొయ్యినేని రమణ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్చార్జి బంగార్రాజు పార్టీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నారని అనడంతో గొడవ ప్రారంభమైంది మరో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షురాలు సుహాసిని మాట్లాడుతూ 15ఏళ్ల నుంచి పార్టీకి ఎంతో కష్టపడుతున్నానని, చింతలవలస గ్రామానికి వైస్ సర్పంచ్ గా ఉండి పోరాడుతున్నానని, తను తక్కువ చేసి స్టేజి మీదకు ఎందుకు పిలవలేదని నాయకులను ప్రశ్నించారు. ఇలా ప్రారంభమైన గొడవ చిలికి చిలికి గాలివానలా పెద్దది కావడంతో నాయకులు ఎవరినీ మాట్లాడినివ్వలేదు. దీంతో ముఖ్యమైన నాయకులందరూ పార్టీ కార్యాలయంలో ఉన్న రూములోకి వెళ్లి మండలం, గ్రామాల్లో వేసిన కమిటీ సభ్యులను లోపలికి పిలిచి వారి అభిప్రాయాలను, గ్రామంలో ఎన్ని కమిటీలు ఉన్నాయి తదితర వివరాలను పరిశీలకుడిగా వచ్చిన మురళీమోహన్‌రావు అడిగారు. ఇలా జరుగుతుండగా ఘర్షణ తలెత్తి ఒకసారిగా టిడిపిలో ఒక గ్రూపు వారు కర్రోతు బంగార్రాజు మీదకు వెళ్లగా మరో గ్రూపు వారు మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు మీదకు వెళ్లారు. దీంతో ఇరు గ్రూపుల వారు ఒకరినొకరు తోసుకొని కొట్టుకున్నారు. గొడవ సద్దు మనిగే పరిస్థితి లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తన సిబ్బందితో సమావేశాన్ని ఆపివేసి అందర్నీ బయటకు పంపించేశారు. దీంతో అధ్యక్ష పదవి కోసం ఏర్పాటు చేసిన సమావేశం అర్ధాంతరంగా ముగిసిపోయి ఎవరి దారిన వారు తిట్టుకుంటూ వెళ్లిపోయారు. కార్యకర్తల్లో గ్రామస్థాయి నాయకులు గొడవలు సృష్టించింది మండల నియోజవర్గ నాయకులేనని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులకు ఒకరంటే ఒకరికొకరు పడకపోవడంతో గ్రామాల్లో రెండు గ్రూపులుగా తయారు చేశారన్నారు ఈ నాయకులు వల్లే రెండు గ్రూపులు ఏర్పాటై గొడవలకు కారణం అవుతుందని తెలిపారు. వారి స్వార్థం కోసం కార్యకర్తలను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు దృష్టిపెట్టాలని కోరారు.

జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కు

15 మంది రైతులకు మాత్రమే బకాయి ఉంది : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధికి, యువతకు ఉద్యోగాల కల్పనకు ఈ పార్కు దోహదపడుతుందని, దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిందాల్ భూములకు సంబంధించి కేవలం 15 మంది రైతులకు మాత్రమే పరిహారం బకాయి ఉందని చెప్పారు. జిందాల్ పరిశ్రమ ఏర్పాటుకు అప్పట్లోనే సుమారు 1166 ఎకరాలను ప్రభుత్వం రైతులనుంచి సేకరించి ఇచ్చిందని తెలిపారు. ఈ భూముల్లో 180 ఎకరాలను జిందాల్ యాజమాన్యమే నేరుగా రైతులవద్దనుంచి కొనుగోలు చేసిందని చెప్పారు. ఇది కాకుండా మొత్తం 375 మంది రైతులనుంచి 834 ఎకరాల అసైన్డ్ భూమిని, 151 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్‌కు కేటాయించిందని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ఇక్కడ వర్తించదని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 28.72 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు ఉన్న బకాయిని వారం రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 1962లో మొత్తం 20మందికి పట్టాలు ఇవ్వగా, వారిలో నలుగురు మాత్రమే ఇళ్లు కట్టుకోగా, వారికి అప్పట్లోనే పరిహారం చెల్లించారని తెలిపారు. మిగిలినవారు ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోకపోవడంతో, వారి పట్టాలు మూడేళ్ల తరువాత రద్దవుతాయని, అటువంటివారికి పరిహారం ఇవ్వనవసరం లేదని స్పష్టం చేశారు.

షేర్లు, ఉద్యోగ కల్పనకు, ఒన్‌టైం సెటిల్‌మెంట్‌కు సంబంధించి జిందాల్ యాజమాన్యమే రైతులతో నేరుగా ఒప్పందం కుదుర్చుకుందని, దానిలో ప్రభుత్వానికి సంబంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని జిందాల్ ప్రతినిధులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. 53 బోర్ బావులకు సంబంధించి ఇంకా పరిహారాన్ని ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పరంగా గానీ, జిందాల్ నుంచి గానీ ఎవరైనా అర్హులైన రైతులకు ఇంకా పరిహారం అందని పక్షంలో, అటువంటివారు ఎస్.కోట తాహశీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. ఎస్‌కోట ఎంఎల్‌ఎ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడే ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు అడ్డపడవద్దని విజ్ఞప్తి చేశారు. డిసిఎంఎస్ ఛైర్మన్ గొంపకష్ణ మాట్లాడుతూ, రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం చాలావరకు ఇప్పటికే చెల్లించిందని, జిందాల్ నుంచి రావాల్సిన బకాయిలను కూడా త్వరలో చెల్లిస్తారని చెప్పారు.

జిందాల్ రైతులకు వారం రోజుల్లో పరిహారం

జిందాల్ భూములకు సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారాన్ని వారం రోజుల్లో రైతులకు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిందాల్ కోసం సేకరించిన భూములపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ తమ ఛాంబర్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు చెల్లించిన పరిహారం, పెండింగ్‌బకాయిలపై ఆరా తీశారు. సుమారు 28 ఎకరాలకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్ ఉందని కలెక్టర్ అన్నారు. వీరికి వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌కోట ఎంఎల్‌ఎ కోళ్ల లలితకుమారి, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంపకష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్, ఎస్.కోట తాహశీల్దార్ డి.శ్రీనివాసరావు, డి సెక్షన్ సూపరింటిండెంట్ తాడ్డి గోవింద, ఇతర అధికారులు, జిందాల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం కాలువకు భూములిచ్చేది లేదు

అధికారులకు తేల్చిచెప్పిన రైతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోలవరం కాలువకు తమ భూములు ఇచ్చేది లేదని రైతులు.. అధికారులకు తేల్చిచెప్పారు. మండలంలోని వీరనారాయణం గ్రామ సచివాలయంలో ఉత్తరాంధ్ర సుజన స్రవంతి కాలువ భూసేకరణ గ్రామసభను శుక్రవారం ఏర్పాటుచేశారు. ఈ గ్రామసభకు డిప్యూటీ కలెక్టర్ కళావతి, అధికారులు హాజరయ్యారు. ఈ గ్రామసభను సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ ఆధ్వర్యాన రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ.12.50 ప్రభుత్వం పరిహారం ఇస్తుందని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలు ధర ఉందని, మీరిచ్చిన రూ.12.5 లక్షలతో 10 సెంట్లు కూడా రాదని చెప్పారు. కాలువ తప్పనిసరి అయితే తమ భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు భూములు ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ మూడేళ్ల క్రితమే అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని, ఆ గ్రామసభలో చేసిన తీర్మానాలు ఏం చేశారని నిలదీశారు. కాలువ పరిధిలో ఉన్న 58 గ్రామాల నిర్వాసితులతో కలెక్టర్ మాట్లాడి ఆ గ్రామంలో ఉన్న బహిరంగ మార్కెట్ ధర అయినా ఇవ్వాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. అధికారులు భూసేకరణ విధివిధానాలు చెప్పేందుకు ప్రయత్నించగా, అవన్నీ తమకు అక్కర్లేదని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో ముమ్ములూరి సత్యనారాయణ, ముమ్ములూరి సోంబాబు, మెరపల పురుషోత్తమ నాయుడు ముమ్ములూరి రవి, బీల సిన్నమ్ములు, ముమ్ములూరు వెంకట్రావు, అవగడ్డ తమ్మునాయుడు, చల్లా చంద్రరావు రావాడ గోవిందరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అభ్యంతరం తెలుపుతున్న సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వీనర్ జగన్

పోరాటాలతోనే హక్కుల సాధన

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి-బొబ్బిలి

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

పోరాటాలతోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల హక్కులను కాపాడుకోవచ్చుని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ అన్నారు. బొబ్బిలి పట్టణంలోని శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏడాది పాలన - ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక వర్గాలపై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నదని అన్నారు. వేలాదిమందికి ఉపాది కల్పించే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు విద్య, వైద్యం, పరిశ్రమలు, కార్మికుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు మూత, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల మార్పు,పని గంటలు పెంపు, పెన్షనర్లకు కొత్త చట్టం, నిరుద్యోగం, పబ్లిక్ సెక్టార్ ను పబ్లిక్ గా అమ్మే పనులు వేగవంతం చేస్తున్నారని అన్నారు. ఇదీ ఏడాది పాలనలో ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన కానుక అని విమర్శించారు. కనుక మన చట్టాలు, హక్కులను కాపాడు కునేందుకు పోరాటాలే శరణ్యం అన్నారు. ముఖ్యంగా రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. ఇదే కొనసాగితే పబ్లిక్ సెక్టార్ సంక్షోభంలో పడిపోతుందని అన్నారు. మన దేశాన్ని ప్రజలే రక్షించగలరు. రాబోయే జూలై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, జెవివి నాయకులు శివానంద్, సిఐటియు నాయకులు శంకరరావు మాట్లాడారు .ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు

విజయనగరం :నిబంధనల ప్రకారమే సెర్ప్ సిబ్బందిని బదిలీ చేశామని డిఆర్‌డిఎ - వెలుగు పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. బదిలీలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మన జిల్లాకు 31 ఎపిఎం పోస్టులు, ఐదు డిపిఎం పోస్టులు కేటాయించడం జరిగిందని తెలిపారు. రేషనలైజేషన్‌లో భాగంగా నిబంధనల ప్రకారం మిగిలినవారు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. డిపిఎంలకు ఇదే ప్రాతిపదికన స్థాన చలనం కలిగిందని వివరించారు. సర్వీసులో జిల్లాలో ఎక్కువ కాలం పనిచేసిన వారిని బదిలీ చేసినట్టు తెలిపారు.

నేడు జిల్లాకు ఐఆర్ఎస్ అధికారి రాక

విజయనగరం : విద్యార్థుల తల్లిదండ్రుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఎన్ఎసిఐఎన్ జాతీయ పరోక్ష పన్నుల అదనపు డైరెక్టర్ ఈదర రవికుమార్ (ఐఆర్ఎస్) శనివారం జిల్లాకు రానున్నట్టు గురజాడ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. '21వ శతాబ్ధంలో పిల్లలకు అవసరమైన నైపుణ్యాలు' అనే అంశంపై తమ పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రులకు బోధిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా కుమారస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా పర్యాటక అధికారిగా పనిచేస్తున్న కుమార స్వామి జిల్లా మైనారిటీ అధికారిగా ఇంఛార్జి బాధ్యతలను చేపట్టారు. జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఇడి ఇంచార్జ్ గా కూడా కుమార స్వామి వ్యవహరిస్తారని ఒక ప్రకటన లో తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ రెండు పోస్టులలో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారని కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉత్సాహంగా వికలాంగుల చదరంగం పోటీలు

విజయనగరం టౌన్ :నగరంలోని మెసానిక్ టెంపుల్ లో నిర్వహిస్తున్న 5వ జాతీయ వికలాంగుల చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజు పోటీలను ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీను వాసరావు కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన జ్వాలాముఖికి అభినందనలు తెలిపారు. ఈ ఆటల పోటీలకు 18 రాష్ట్రాల నుంచి 106 మంది వికలాంగులకు హాజరయ్యారు. పోటీలు శనివారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో చదరంగం అసోసియేషన్ కార్యదర్శి జ్వాలాముఖి పాల్గొన్నారు.

'సికిల్ సెల్' వ్యాప్తిని అరికట్టాలి

- వ్యాధిగ్రస్తులకు పూర్తి వైద్య సహాయం
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సికిల్ సెల్ వ్యాధిని పూర్తిగా అరికట్టాలని, వ్యాధిగ్రస్తులకు మెరుగైన పూర్తి వైద్యం అందించాలని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తమ ఛాంబర్ లో సికిల్ సెల్ వ్యాధిపై వైద్య ఆరోగ్య, గిరిజన, సాంఘిక సంక్షేమ, మాతాశిశు సంక్షేమశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సికిల్ సెల్ వ్యాధి గురించి పూర్తి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. జీవనరాణి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ రాణి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో గిరిజన గ్రామాల్లో సుమారు 44వేల మంది జనాభా నివసిస్తున్నారని, 28 వేల మందిలో 17వేల మందికి సికిల్ సెల్ టెస్టులు నిర్వహించగా, ఇద్దరికి వ్యాది ఉన్నట్లు తేలిందని చెప్పారు. 118 మందికి వ్యాధి వచ్చే అవకాశం ఉందని నిర్ధారణ అయినట్లు తెలిపారు. వీరు కాకుండా ప్రస్తుతం జిల్లాలో 160 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సికిల్ సెల్ వ్యాధి గల 160 మందికి అందిస్తున్న వైద్యంపై వారం రోజులలో పూర్తి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. 40 సంవత్సరాల లోపు వయసుగల మిగిలిన 8వేల మందికి వారం రోజుల్లో వైద్య పరీక్షలు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గల అన్ని గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న 160 మందికి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల వారీగా మ్యాపింగ్ చేయాలన్నారు. వ్యాధి వచ్చే అవకాశం ఉన్న 118 మందితో సమావేశం నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సికిల్ సెల్ వ్యాధి పై అవగాహన కల్పించే కరపత్రాన్ని, కరదీపికలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ కె.పద్మలీల, డిఇఒ మాణిక్యంనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం. అన్నపూర్ణ, ఐసిడిఎస్ పిఒ ఎన్.ఆరుద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, డిఎన్ఎం అర్చన, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పంటల బీమాపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకంపై విస్తత ప్రచారం కల్పించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పంటల బీమా పథకం వివరాలు తెలియజేసే కరపత్రాలు, పోస్టర్ లను జెసి ఛాంబర్ లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, నువ్వులు, పత్తి పంటలు సాగు చేస్తున్న రైతులకు అనేక రకాలైన ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్ట పోకుండా వారిని రక్షించే విధంగా దిగుబడి ఆధారత పంటల బీమా పథకం, వాతావరణ పరిస్థితులు ఆధారంగా అమలు చేసే పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం గురించి ప్రతి రైతుకు తెలియజేయాలని, ప్రీమియం చెల్లించి లబ్ధి పొందే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. టి. రామారావు పంటల బీమా పథకం గురించి వివరించారు. దిగుబడి ఆధారిత పంటల భీమా పథకానికి వరి ఎకరానికి 200 రూపాయలు, మొక్కజొన్న పంటకు ఎకరానికి 165 రూపాయలు, నువ్వు పంటకు ఎకరానికి 65 రూపాయలు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఆధారంగా పంటల బీమా పథకం ద్వారా ప్రతి పంటకు ఎకరాకు 1923 రూపాయలు చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ నారాయణమూర్తి, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు, ఇఫ్కో ప్రతినిధి రామకృష్ణ, వ్యవసాయ ఇన్సూరెన్స్ కంపెనీ జోనల్ మేనేజర్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు

కార్పొరేషన్ కార్యాలయం వద్ద కూరగాయల వ్యాపారుల ధర్నా

ధర్నా చేస్తున్న కూరగాయల వ్యాపారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కూరగాయలు అమ్ముకుంటున్న తమ పొట్ట కొట్టొద్దని కూరగాయలు అమ్మే రైతులు,వ్యాపారులు శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయం జంక్షన్, మహిళా పార్కు వద్ద కూరగాయల వ్యాపారాలు చేయొద్దు అంటూ గురువారం నగర పాలక సిబ్బంది ఖాళీ చేయించారు. దీంతో వారంతా శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యాపారులు సుమన్, పి.లక్ష్మి మాట్లాడుతూ అనేక ఏళ్లుగా తాము గ్రామాల నుంచి కూరగాయలు నుంచి తెచ్చుకుని అమ్ముకుంటున్నామన్నారు. వేకువ జామున ఐదు గంటలకు వచ్చి 10 గంటల లోపు అమ్ముకొని వెళ్ళిపోతున్నామని, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా అమ్మకాలు చేసుకుంటుమన్నారు. అయిన నగర పాలక సంస్థ అధికారులు ఉన్న పళంగా ఖాళీ చేయమని చెప్పడం సరికాదన్నారు. తమ వ్యాపారాలకు అవకాశం ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు.

సచివాలయ సిబ్బంది బదిలీలు

నేడు ప్లానింగ్, ఎమినిటీ కార్యదర్శులకు..

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

జిల్లాలో నగర పాలక సంస్థతో పాటు అన్ని మున్సిపాల్టీల్లోగల సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం నుంచి బదిలీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఎడ్యుకేషన్ కార్యదర్శులు, అడ్మిన్లు, శానిటేషన్ కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులకు బదిలీలు చేపట్టారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ రెండు రోజులు పాటు విజయనగరం, బొబ్బిలి,సాలూరు, నెల్లిమర్ల పురపాలక సంఘాల్లో సచివాలయ ఉద్యోగులకు మాన్యువల్ పద్ధతిలో బదిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజు అడ్మిన్లు, ఎడ్యుకేషన్ కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులకు బదిలీలు చేపట్టామన్నారు. శనివారం ప్లానింగ్ కార్యదర్శులు, ఏమినిటి కార్యదర్శులకు బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా పోలీస్‌లకు పోలీసు శాఖ, హెల్త్ కార్యదర్శులకు ఆరోగ్య వైద్య శాఖ, రెవెన్యూ కార్యదర్శులకు రెవెన్యూ శాఖ బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహిస్తాయన్నారు. ఖాళీల ఆధారంగా అభ్యర్థులు కోరుకున్న ప్రాంతాల్లో బదిలీలు కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో బొబ్బిలి,సాలూరు, నెల్లిమర్ల కమిషనర్లు పాల్గొన్నారు.

ఏడుగురు కార్యదర్శులకు మెమోలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మెమోలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. 24వ నెంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే రికార్డుల నిర్వహణలో ఏడుగురు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి వారందరికీ శ్రీముఖాలు జారీ చేశారు. ఇటువంటివి పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మందలించారు.

ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల
అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యాన 20 కేటగిరీలలో మొత్తం 91 ఉద్యోగాలను భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, 1 కేటగిరికి సంబంధించిన ప్రొవిషనల్ మెరిట్, 5 కేటగిరీలకు సంబంధించిన స్పీకింగ్ ఉత్తర్వులు విడుదల చేశామని మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ కె.పద్మలీల తెలిపారు. 1వ కేటగిరికి సంబంధించిన ప్రొవిషనల్ మెరిట్, 5 కేటగిరీలకు సంబంధించిన స్పీకింగ్ ఆర్డర్స్ http://vizanagaram.ap.gov.in, http://vizianagaram.nic.in వెబ్‌సైట్‌లో గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, విజయనగరం gmcvizianagaram.ap.gov.in లో పొందుపర్చినట్లు తెలిపారు. సైకియాట్రీ సోషల్ వర్కర్, ఓటీ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, ల్యాబ్-అటెండెంట్, ఎలక్ట్రికల్ హెల్పర్, స్టోర్ అటెండెంట్‌పోస్ట్ లలో 1 కేటగిరీ ప్రొవిషనల్ మెంట్ జాబితాలో అభ్యంతరాలను జూన్ 28, జూన్ 30 నుండి జూలై 5 తేదీ లోగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు లిఖిత పూర్వకముగా సరైన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు.

ఎంస్‌పితో మాట్లాడుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుపై ఎస్ఐ దౌర్జన్యం
కలెక్టర్‌కు, ఎంఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి-కంటోన్మెంట్
10 టివి స్టాఫ్ రిపోర్టర్ ఎంఎంఎల్ నాయుడుపై టూటౌన్ ఎస్ఐ మురళి దౌర్జన్యానికి పాల్పడ్డారు. నగరంలోని పూల్‌బాగ్ అయ్యప్పనగర్‌లో రిటైర్డ్ డిఇఒ ఎస్.అప్పలనాయుడుపై దుండగులు దాడి చేసిన నేపథ్యంలో ఆ వార్తకు సంబంధించి శుక్రవారం నాయుడు మొబైల్ ఫోన్ లో వీడియోలు తీస్తుండగా ఎస్ఐ అభ్యంతరం చెప్పారు. అంతేకాకుండా చేతిలో ఉన్న ఫోన్ లాక్కొని దుర్భాషలాడారు. ఇదేమీ పద్ధతి అంటూ ప్రశ్నించిన జర్నలిస్ట్‌పై దౌర్జన్యం చేస్తూ ఫోన్ లాక్కొని, మీడియా అయితే ఎవడికి ఎక్కువ అంటూ జులుం ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు, అడిషనల్ ఎస్‌పి సౌమ్యలతకు జర్నలిస్టులంతా కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే మంగళవారం ఎస్‌పి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని జర్నలిస్టులు తెలిపారు.

బిసి విద్యార్థులకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

లక్కవరపుకోట : బిసి విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో ప్రాధానమిస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం జమ్మాదేవిపేట వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన పది మంది విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని చెప్పారు. వీరు ఉన్నత చదువులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఉత్తమ ఫలితాలు రాబట్టిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

పూసపాటిరేగ : పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎస్.జీవన రాణి సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అందుతున్న సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆర్‌సిహెచ్, ఇహెచ్‌ఆర్ సేవలు, ల్యాబ్, ఫార్మసీ కార్యకలాపాలను సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి ప్రసవాల నాణ్యతను మెరుగుపరచాలని, డేటా కంప్యూటరైజేషన్ చేపట్టాలని సూచించారు. అతిసార నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, పిహెచ్‌సి వైద్యాధికారులు ఎస్.ప్రమీలదేవి, బి.కృష్ణచైతన్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమణి, హెల్త్ సూపర్వైజర్ నానమ్మ, స్టాఫ్ నర్స్ జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యవంతుడు

వేపాడ : వైసిపి బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిపి దొంగ సత్యవంతుడు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం వైసిపి అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవీ బాధ్యతలు అప్పగించిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలతో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

బొబ్బిలి : మున్సిపల్ మేనేజర్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. జులై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఫెడరేషన్ నాయకులు యుగంధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎం.ప్రసాద్, జి.పోలా, బి.వెంకటి పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

వేపాడ : మండలంలోని సింగరాయి, పాటూరు, సోంపురం సచివాలయాల్లో శుక్రవారం ఎంపిడిఒ సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సచివాలయ సిబ్బంది హాజరు పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరై, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకు క్లోరినేషన్ చేయాలని సూచించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్త సేకరణకు సచివాలయ సిబ్బంది, విఒఎ, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో రూట్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. సోంపురం రైతు సేవా కేంద్రం, సచివాలయ పరిసరాల పరిధిలో శానిటేషన్ చేయాలని, చెత్త సేకరణ వాహనాలను వినియోగంలోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఎఫ్ఐ మేనేజర్‌గా ఈశ్వరరావు

బొబ్బిలి : ఎస్‌బిఐ ఎఫ్ఐ (ఫైనాన్సియల్ ఇన్‌క్లూజన్) మేనేజర్‌గా ఈశ్వరరావు శుక్రవారం విధుల్లో చేరారు. ఆయనకు రీజనల్ మేనేజర్ బిబి సాహు నియామక పత్రం అందజేశారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సత్యానందం బదిలీ అయ్యారు. ఎఫ్ఐ కంట్రోల్‌లో పనిచేస్తున్న సిఎస్‌పిల్లో సేవలు నిబంధనల మేరకు అందజేసేందుకు కృషి చేస్తానని ఈశ్వరరావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పెంపు

రామభద్రపురం : మండలంలో మరో ఐదు పోలింగ్ కేంద్రాలు పెంచినట్లు తహశీల్దార్ అజురఫీజాన్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ పార్టీల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్టక్కి, మిర్తివలస, మట్చర్లవలస గ్రామాల్లో ఒక్కొక్కటి, ఆరికతోటలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎన్నికల ఉప తహశీల్దార్ గౌరీ శంకర్, టిడిపి మండల అధ్యక్షుడు భాస్కరరావు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామంలో శుక్రవారం సిహెచ్‌ఒ పార్థసారథి ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టి, మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలో మొయిద జంక్షన్‌లో శుక్రవారం సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. నేర నియంత్రణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. వీటివల్ల నేరస్తులను త్వరగా పట్టుకోవడానికి వీలవుతుందని చెప్పారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

వేపాడ : మండలంలోని చామలాపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన పోతుబందిపాలెంలో బంగారమ్మ తల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

మా ఊరి శ్రీమంతులు
సొంత డబ్బులతో సర్కారు బడి రూపురేఖలు మార్చిన యువత

క్షణం కూడా తీరిక లేకుండా సెల్‌ఫోన్లతో గడిపే యువతను ఇప్పటివరకు మనం చాలా గ్రామాల్లో చూస్తూ ఉంటాం. కానీ, ఇది మన ఊరు... ఊరు కోసం ఏదైనా చేయాలి... అనే ఆలోచన కొంతమందిలోనే ఉంటుంది. అలాంటి రెండో కోవకు చెందుతారు... గజపతినగరం మండలం బూడిపేట యువత. గ్రామంలో తాము ఉన్నత శిఖరాలకు చేరడానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రభుత్వ పాఠశాలను భవిష్యత్తు తరాల కోసం అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అందుకోసం చేయి చేయి కలిపి, రూపాయి రూపాయి పోగుచేసి.. కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటారా..?

గతంలో బూడిపేట ప్రభుత్వ పాఠశాల

ప్రస్తుతం సర్వాంగ సుందరంగా మారిన పాఠశాల

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్
గజపతినగరం మండలం బూడిపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. తాము చదివిన, తమ అభివృద్ధికి దోహదపడిన బడికి ఏదైనా చేయాలని ఆ గ్రామ యువత, ఉద్యోగులు భావించారు. తలాకొంత చందాలేసుకుని రూ.52 వేలు పోగుచేశారు. కార్పొరేట్ పాఠశాల స్థాయిలో భవనాన్ని బాగుచేశారు. సకల సదుపాయాలూ కల్పించారు. యువతే శ్రమదానం కూడా చేశారు. చుట్టుపక్కల గ్రామాల వారితో ఔరా! అనిపించేలా అభివృద్ధి చేశారు. అంతే కాదండోయ్!. 'ప్రయివేట్ స్కూల్.. ఇంగ్లీష్ మీడియం..' అంటూ వెళుతున్న 11 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సర్కారు బడి ప్రాముఖ్యతను తెలియజేశారు. వారి పిల్లలను గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఒప్పించారు. దీంతో గ్రామస్తులతో పాటు, చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలు, నాయకులు యువతను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' అక్కడి యువతను పలకరించగా, భవిష్యత్తు తరాల కోసం తాము చేస్తున్న ప్రయత్నం చాలా చిన్నదని తమ సింప్లిసిటీని చాటుకున్నారు. భవిష్యత్తులో స్కూల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

రోడ్డు వేయాలని గిరిజనుల ధర్నా

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట
రేగపుణ్యగిరి గిరిజన గ్రామానికి పక్కా రోడ్డు వేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల గాడి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన రేగపుణ్యగిరి గిరిజనులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రంజిత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో రేగపుణ్యగిరికి గిరిజనులు శ్రమదానంతో కొంత రోడ్డు నిర్మించినా వర్షాల కారణంగా అది కొట్టుకుపోయిందని తెలిపారు. మళ్లీ గిరిజనుల డోలి మోతలు పెరగడంతో జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామానికి ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల ద్వారా రోడ్డు నిర్మించాలని రోడ్డును మంజూరు చేస్తే, ఆ రహదారి నిర్మాణం మందకొడిగా సాగుతోందన్నారు. ఇప్పుడు ఆ నిర్మాణానికి కూడా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని అనుమతులు తీసుకొచ్చి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించినా స్థానిక నాయకులు, అధికారుల వల్ల పనులు కావడం లేదని చెప్పారు. తహశీల్దార్ స్పందించి రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు తొలగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెలికాని ముత్యాలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది
సాంఘిక సంక్షేమ శాఖ పర్యవేక్షకులు జనార్దనరాజు

ప్రజాశక్తి-విజయనగరం
తన నలభై ఏళ్ల ఉద్యోగ జీవితాన్ని ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అందరి సహకారంతో విజయవంతంగా పూర్తి చేయగలిగానని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం పర్యవేక్షకులు పాకలపాటి జనార్ధనరాజు చెప్పారు. ఈ నెలాఖరుకు ఉద్యోగవిరమణ చేస్తున్న సందర్భంగా ఆయన అనుభవాలను ప్రజాశక్తి తో పంచుకున్నారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

నేను ఉద్యోగం లో చేరినప్పటికి ఎటువంటి సౌకర్యాలూ లేనప్పటికీ అప్పగించిన పనులు సమయానికి పూర్తి చేయడం వల్ల అధికారుల వద్ద మంచి సంపాదించుకున్నాను. అందుకే జిల్లాలో ఎక్కడికి బదిలీ అయినా నన్ను జిల్లా కార్యాలయంలో ఉంచి అధికారులు పనిచేయాంచుకునేవారు. అందుకే నా 40ఏళ్ల సర్వీస్ లో మూడేళ్లు మినహా మిగతా సర్వీసు అంతా విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలోనే పనిచేశాను.

మాది వ్యవసాయ కుటుంబం. విజయనగరం జిల్లా పూసపాటిరేగ అయినా, పుట్టి పెరిగింది గంట్యాడ మండలం బుడతనాపల్లిలో. తల్లిదండ్రులు పాకలపాటి వెంకటరామరాజు కొండమ్మ దంపతులకు 1963 జూలై ఒకటన జన్మించాను. ఇద్దరు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెలు, భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు రవితేజ, గాయత్రి ఉన్నారు. పిల్లలు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు బుడతనాపల్లిలో చదువుకున్నాను. పది పూర్తి అయన వెంటనే ఉద్యోగం రావడం తో ఉద్యోగం చేస్తుండగానే ఇంటర్, డిగ్రీ, పిజి పూర్తి చేశాను.

ఆగస్టు ఒకటి 1985 లో ఆఫీస్ సబార్డినేటు గా సాంఘిక సంక్షేమ శాఖ విజయనగరం లో జాయిన్ అయ్యాను. దీనికి ముందు మూడేళ్లు సివిల్ సప్లై, హౌసింగ్ కార్పొరేషన్ లో పనిచేశాను. కార్పొరేషన్ లో అయితే పెన్షన్ రాదు కాబట్టి, వేరే శాఖకు మార్చాలని కలెక్టర్‌ను కోరడంతో సాంఘిక సంక్షేమ శాఖ లో వేశారు. అప్పటి నుంచి 1991వరకు ఒఎస్ గా పనిచేస్తున్న కాలంలోనే 1991లో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగోన్నతి వచ్చింది. 2008లో సినీయర్ అసిస్టెంట్ గా పదోన్నతి తీసుకొని 2016 వరకు పని చేసాను. ఈ మొత్తం సర్వీస్ విజయనగరం లోనే చేసాను. 2016లో పర్యవేక్షకులుగా ఉద్యోగోన్నతి పొంది పార్వతీపురం ఎపిఎస్ డబ్ల్యు స్కూల్‌కు వెళ్లాను. అక్కడ 2019 వరకు పనిచేసి తిరిగి విజయనగరం డి డి ఆఫీస్‌కు వచ్చాను. అప్పటి నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాను.

ఎక్కువ కాలం విజయనగరం హెడ్ ఆఫీస్ లో పని చేయడం వల్ల అన్ని తరగతుల ఉద్యోగులకు సర్వీసు చేశాను. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ విషయం లోను వారికి ఇబ్బంది లేకుండా చూడటం, కాంపన్సేటివ్ ఉద్యోగుల నియామకాల్లో ఎవరికీ ఇబ్బంది లేకుండా సమయానికి వారికి ఆర్డర్స్ ఇవ్వడం, తన చేతులు మీదిగా చాలా మందికి ఉద్యోగ నియామిక పత్రాలు ఇవ్వడం చాలా సంతృప్తి నిచ్చింది.

అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ, ఇప్పటి కలెక్టర్ అంబేద్కర్, మధ్యలో మరో కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసలు అందుకున్నాను. ఉద్యోగజీవితం ప్రశాంతంగా విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన అధికారులకు, సహచర ఉద్యోగులకు, సిబ్బందికి కృతజ్ఞతలు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..
వీడిన వాచ్‌మెన్ హత్య కేసు మిస్టరీ ● నిందితుడు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రాఘవులు

ప్రజాశక్తి-బొబ్బిలి
బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో వాచ్‌మెన్ వెంకటరమణ హత్య కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి అడ్డుచెప్పడం వల్లే కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తేలింది. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎస్.రాఘవులు వివరించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం...

పట్టణంలోని దిబ్బవీధికి చెందిన కనిమెరకల వెంకటరమణ.. గ్రోత్‌సెంటర్‌లోని రాఘవ కనస్ట్రక్షన్ కంపెనీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 20న రాత్రి వెంకటరమణపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటరమణను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మరణించాడు. సిసి కెమెరా ఫుటేజీ, కాల్ డేటా, సంఘటన స్థలం వద్ద లభ్యమైన పర్స్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. పాతబొబ్బిలి ధనంజయ చికెన్ షాపులో పనిచేస్తున్న కోట సర్వేశ్వరరావును అరెస్టు చేశారు. వెంకటరమణ కుమార్తె చికెన్ సెంటర్లో అకౌంటెంట్‌గా పని చేస్తోంది. ఆమెకు భర్తతో గొడవలు ఉన్నాయి. ఆమెతో నిందితుడు సర్వేశ్వరరావుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం ఆమె తండ్రికి తెలియడంతో సర్వేశ్వరరావును మందిలించాడు. దీంతో కక్ష పెంచుకుని వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సమయంలో కర్రతో దాడి చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. సర్వేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన పట్టణ సిఐ సతీష్ కుమార్, ఎస్ఐ రమేష్, సిబ్బందిని డిఎస్‌పి రాఘవులు అభినందించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి
డిపిఒ మల్లికార్జునరావు

దెంకాడ.. తాగునీటి ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-డెంకాడ
గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డిపిఒ డివి మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని గొలగాం గ్రామాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త సేకరణ ఏ విధంగా సాగుతోంది, పిడబ్ల్యుఎస్ ట్యాంకు క్లీనింగ్ జరిగిందా? లేదా? క్లోరినేషన్ తదితర వాటి గురించి పరిశీలించారు. గ్రామంలో మంచినీటి సరఫరా ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపి సెంటర్‌ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, కార్యదర్శి భారతి, అనూష, ఉపసర్పంచ్, నాయకులు గంగాధర్, పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పరిసరాల్లో అపారిశుధ్యాన్ని దరి చేరనీయకూడదని డిఎల్‌పిఒ శిరీష కోరారు. పట్టణంలోని చెత్తశుద్ధి కేంద్రాన్ని ఆమె సందర్శించారు అనంతరం గ్రామంలో నిర్వహించిన చెత్త సేకరణను ఆమె పరిశీలించి, ప్రజలకు తడి, పొడి చెత్త కోసం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఇఒ అనురాధ పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్ : ఎం.వెంకటాపురంలో పారిశుధ్య నిర్వహణను ఎంపిడిఒ బి.కళ్యాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు, స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రావు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయాలి

బొబ్బిలి : రైతులను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు అప్పుల చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

నేడు విద్యుత్తు అంతరాయం

నెల్లిమర్ల : కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కనెక్షన్ పనులు, చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలను సరిచేస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు చంద్రంపేట, గెద్దపేట, సెంచూరియన్ యూనివర్సిటీ ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా రథయాత్ర

ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- లక్కవరపుకోట
లక్కవరపుకోటలో జగన్నాథ స్వామి రథయాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వచ్చే నెల ఆరో తేది వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు తెలిపారు. రథయాత్ర సందర్భంగా నిర్వహించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి-రామభద్రపురం
మండల పరిధిలోని జోగిందొరవలస గ్రామంలో ఈ నెల 21న జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన కేసులో శుక్రవారం వంగపండు వల్లంనాయుడును అరెస్ట్ చేసినట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి రాఘవులు తెలిపారు. ఈ ప్రమాదంలో బొబ్బిలి మండలం మోసూరువలస గ్రామానికి చెందిన మోసూరు భాస్కరరావు మృతి చెందాడు. ఆరోజు డ్రైవర్ వల్లంనాయుడు, మృతుడు భాస్కరరావు, మరో వ్యక్తి దేసర్ల లక్ష్మణరావు పూటుగా మద్యం తాగి ముగ్గురూ ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో బ్లేడ్ ట్రాక్టర్ ఎక్కి వస్తుండగా దారి మధ్యలో గొయ్యి ఉండడంతో తూలి పడి భాస్కరరావు మృతి చెందినట్లు డిఎస్‌పి తెలిపారు. భాస్కరరావు ఎస్‌టి కావడంతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ
మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి
మండలంలో పారాది సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో అదే గ్రామానికి చెందిన మహిళ సారిక అప్పలరాము తీవ్రంగా గాయపడ్డారు. పారాదికి చెందిన పి.అప్పలనాయుడు, అప్పలరాము మెట్టవలస నుంచి ద్విచక్రవాహనంపై పారాది వెళ్తున్నారు. గరివిడికి చెందిన ఎ.అప్పన్న, వై.రవి మద్యం తాగి వాహనం నడుపుతూ వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో అప్పలరాము తీవ్రంగా గాయపడింది. మహిళను అంబులెన్స్‌తో బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విత్తన షాపుల్లో తనిఖీలు

రికార్డులను తనిఖీలు చేస్తున్న ఎఒ శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం
నగరంలోని పలు విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వరి విత్తనాల నమూనాలను సేకరించారు. రికార్డులు, స్టాకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ శ్రీనివాస్ మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని, రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఇఒలు డి.గిరి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభ బహిష్కరణ

గ్రామసభను బహిష్కరించిన గిరిజనులతో సిపిఎం నాయకులు సురేష్

ప్రజాశక్తి-బాడంగి
మండలంలోని పినపెంకి పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభను సిపిఎం ఆధ్వర్యాన గదబవలస గిరిజనులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్‌చేశారు. గ్రామంలో వారం రోజుల నుంచి తాగడానికి మంచినీరు రావడం లేదని తెలిపారు. ఓ పెత్తందారుడు ట్రాక్టర్‌తో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో సరఫరా నిలిచిపోయిందని, దీనివల్ల తాగునీరు అందడం లేదని చెప్పారు. వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించి, తాగునీరు అందించాలని డిమాండ్‌చేశారు. శ్మశానవాటికకు రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్‌చేశారు. గ్రామసభకు అన్ని శాఖల అధికారులు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్తు శాఖ అధికారులకు గ్రామసభ ఉన్నట్టు తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు.

కార్యాలయాల పరిశీలన

కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సిఇఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్
మండలంలోని జగన్నాథపురంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డిడిఒ, డిఎల్‌పిఒ, ఉపాధి హామీ ఎపిడి కార్యాలయాలను జెడ్‌పి సిఇఒ బి.వి సత్యనారాయణ , డిప్యూటి సిఇఒ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి డివిజన్ ఏర్పాటుకావడంతో జిల్లా పరిషత్తు, పంచాయతీ డివిజనల్ అధికారులు నియమితులైనట్లు చెప్పారు. వారి శాశ్వత కార్యాలయాలు మంజూరు అయ్యేంత వరకు తాత్కాలికంగా జగన్నాథపురం సచివాలయంలో ఉన్న అదనపు గదులు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిడిఒ కిరణ్ కుమార్, ఎంపిడిఒ రవికుమార్, పిఆర్ డిఇ అప్పారావు, ఎఇ రాజశేఖర్, సర్పంచ్ బి.పద్మ పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేయాలి

ప్రజాశక్తి-రేగిడి
ఉపాధి పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనదారులకు రూ.307 కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపిడిఒ శ్యామలకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని లచ్చరాయపురం కోమటివానిచెరువు పనులను పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పర్యవేక్షణలో వేతనదారులు పనులు చేయకుండా గట్లపై కూర్చొని ఉంటున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. పనులు చేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని, లేకుంటే తక్కువ వేతనం వస్తుందని గమనించాలని అసూచించారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్లు ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ ఉన్నారు.

డాక్యుమెంట్ పోయినది

తేది 18/06/2025 విజయనగరంలో గంట స్థంభం దగ్గర నేను బైక్ మీద వెళ్లుచుండగా నా పేరున రిజిష్టరై ఉన్న ఒరిజినల్ రిజిష్టర్డు డాక్యుమెంట్ నెంబరు 5906/2021 పోయినవి. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినచో క్రింది అడ్రసుకు అందజేయ వలసినదిగా కోరుచున్నాను.

నంబూరి తేజేశ్వరరావు
Flat No-302, Renuka Enclave,
Sheela Nagar, Visakhapatnam,
Mobile No. 9729762673

అమలు నోటీస్
మహారాజశ్రీ బొబ్బిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
E.P 2/2024; O.S. 12/2019

మరడాన ధనుంజయ రావు .....డిహెచ్‌ఆర్
బొత్స ఆదర్శ గాంధీ ......జేడిఆర్
టు.
బొత్స ఆదర్శ గాంధీ, 59 సం॥, S/o సత్యం నాయుడు, స్వామి వారి వీధి, బొబ్బిలి.
పై నెంబర్ అమలు ఇందలి డిహెచ్గార్ మీపై డిక్రీ బకాయి రాబట్టుటకు దాఖలు చేసిన అమలు **తే. 10.07.2025 దీ** ని వాయిదా అయి ఉన్నది. ఆ దినము మీరు శ్రీ కోర్టు వారి యెదుట **ఉదయం 10.30 ని॥**లకు స్వయముగా గాని, మీ అధీకృత ఏజెంట్ ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున పై దావా పరిష్కరించబడును.
(శ్రీ కోర్టువారి ఆదేశములతో)

తిరుపతి పాణిగ్రాహి
వాదితరపు న్యాయవాది
సెల్ : 9440180660
బొబ్బిలి

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM DISTRICT JUDGE (1ST ADDITIONAL DISTRICT JUDGE) AT VIZIANAGARAM
M.V.O.P. :-198/2025

BETWEEN;
BIKAS NAYAK ....PETITIONER
AND;
ENUMULA BHASKAR AND 4 OTHERS .... RESPONDENTS

PUBLIC NOTICE

TO
THE RESPONDETS,
R3;- Neelkamal pasupuleti
TO :-
NEELKAMAL PASUPULETI s/o Venkata raju, Insurer of the moter cycle, bearing no ;- AP39FH01009 (as per policy), pot no;- 10, Maruti nagar, bogguladibba, opp;- Excise Police station, cantonment, Vizianagaram, Vizianagaram district.

Please take notice that petitioner filed the above M.V.O.P. against you, and the above matter stands posted to 29-7-2025 for your appearance before the above Honourable court. therefore, you have to appear before the above said court either personally or through an ADVOCATE duly authorized at **10.30 am, on 29-7-2025,** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

A.A.RAJU
Advocate, Vizianagaram
Cell:9676126777

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 104/2023

చోడవరపు అప్పారావు ....వాది
VS
చొప్ప రామ క్రిష్ణ వగైరాలు. ......ప్రతివాదులు
D2. సల్లగుండ్ల విశ్వనాథం S/o శివప్ప, R/o Door No. 3-56, మెయిన్ రోడ్డు, డెంకాడ గ్రామం, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా.
పై నెంబరు దావాలో యిందలి D2కి ఎన్ని పర్యాయములు బేటా కట్టినను యిందలి D2కి సర్వీసు అవ్వనందున పై కోర్టువారు యిందలి D2కి పేపరు ప్రకటన వేయించమని ఆర్డరు వేసిరి. సదరు కోర్టు వారు ఆర్డరు ప్రకారం తే16-07-2025దీకి వాయిదా ఉన్నదని ప్రజాశక్తి విజయనగం పేపరులో పబ్లికేషన్ వేయించడమైనది. సదరు D2 పరోక్షంగాని లేక లాయరు గారి ద్వారాగాని తే16-07-2025దీన వాయిదా ఉన్నదని తెలుపుతూ. **తే 16-07-2025దీన ఉదయం 10-30 నిముషములకు** హాజరు కావలెను. లేనిచో శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మాణం చేయబడును.

వి.సత్యన్నారాయణ
న్యాయవాది,
విజయనగరం,
సెల్ : 9573972521